జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
## తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శుక్రవారం | 18-4-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 313 పేజీలు: 4 వెల: రూ.7



# మస్కట్‌లో చిక్కుకున్నాం..
# ఆదుకోండి!

- ఏజెంట్లు, దళారుల బారిన పడి మోసపోయిన ఉద్దానవాసులు
- వెల్డింగ్ పనులని చెప్పి.. షిప్ క్లీనింగ్ పనులు
- ఇదేంటని అడిగితే పాస్‌పోర్టులు తీసుకుని యాజమాన్యం
- పూటగడవక పస్తులుంటున్న జిల్లావాసులు
- ఆదుకోవాలని కోరుతున్న వలస కూలీలు
- కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అశోక్ దృష్టికి తీసుకువెళ్లనున్న తల్లిదండ్రులు

**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 17 (వార్త):** వారంతా రెక్కాడితే గానీ డొక్కాడని వలస కూలీలు. రాష్ట్రంలో ఏ జిల్లాలో చూసిన శ్రీకాకుళం జిల్లా వలస కూలీలే. దేశంలో ఏ రాష్ట్రంలో చూసినా శ్రీకాకుళం జిల్లా వలస కూలీలే. అంతర్జాతీయ స్థాయిలో ఏ దేశంలో చూసినా వలస కూలీ శ్రీకాకుళం జిల్లా వాసినే. జిల్లాలో ఎక్కువగా ఉద్దానం ప్రాంతం వాసులే వలస కూలీలుగా పనిచేస్తున్నారు. పారిశ్రామికంగా ఎటువంటి ఉపాధి లేకపోవడంతో పొట్టకూటి కోసం ఇతర దేశాలకు వలస వెళుతున్నారు. వీరి ఆకలి.. కొంతమంది ఏజెంట్లకు, బ్రోకర్లకు అన్నం పెడుతోంది. నిత్యం విదేశీ ఉద్యోగాల వల్ల మోసపోయిన సంఘటనలు చూస్తూనే ఉన్నాం. అయినప్పటికీ పదేపదే మోసపోతూనే ఉన్నారు. పోలీసులు, ఎన్జీవోలు, ఇతర ప్రభుత్వ అధికారులు, కొన్ని సంస్థలు, మీడియా సంస్థలు పలుమార్లు విదేశీఉద్యోగాల మోసాల పట్ల హెచ్చరిస్తున్నప్పటికీ వారి ఆకలి ముందు ఆ హెచ్చరికలు కనబడడం లేదు. కుటుంబాన్ని పోషించుకోవాలని ఉన్నదంతా అమ్మి అప్పులు చేసి వలస వెళ్తే తీర అక్కడ మోసపోయి చిక్కుకొని జైలు పాలై నరకయాతన పడుతున్న సంఘటనలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తూనే ఉన్నాయి. మోసపోవడం వీరి వంతైతే.. మోసం చేయడం కొందరు బ్రోకర్ల నైజం. ఇటీవల తేలుకుంచిలో 22 ఏళ్ళ కుర్రాడు 350 మంది వలస కూలీలను మోసం చేశాడంటే ఏ స్థాయిలో నిరుద్యోగ సమస్య ఉందో తెలుసుకోవచ్చు. మొదటిసారి వెళ్ళిన వారైతే మోసపోవచ్చు ఇప్పటికే మూడు నాలుగు సార్లు వలస కూలీలగా విదేశాలకు వెళ్లి పనిచేసి స్వగ్రామానికి వచ్చి మరోసారి వెళ్ళినప్పుడు వీసా ఇమిగ్రేషన్ కంపెనీ అనుమతులు ఇటువంటివన్నీ వెబ్సైట్లో తనిఖీ చేయకుండానే వెళ్లి మోసపోతున్నారు. ఏజెంట్లు, బ్రోకర్లు మాత్రం స్థానికంగానే ఉండి కోట్లకు కోట్లు కొల్లగొడుతున్నారు. మహా అయితే సెటిల్మెంట్ కి వస్తే రెండు లక్షల బదులు ఇరవై వేలుఇస్తామని పంచాయతీ తీర్మానాలు చేస్తున్నారు ఇది అదునుగా భావించి కోటి రూపాయలు మోసం చేసి 20 లక్షలు చెల్లించి 80 లక్షల మిగిలించుకుంటున్నారు. ఇదేదో వ్యాపారం బాగుందని ఊరికి ఇద్దరు ఏజెంట్లు తయారవుతున్నారు. వాస్తవం ఏంటంటే చాలామంది ఏజెంట్లు ఇప్పటివరకు పక్కనున్న నేపాల్, శ్రీలంక కూడా వెళ్లి వచ్చిన దాఖలాలు లేవు. కొంతమంది బ్రోకర్లు కైతే పాస్ పోర్టులు కూడా లేవు. వీరికే పనిలేదు, వీరు ఇంకో వందమందికి పని కల్పిస్తామని మోసం చేస్తున్నారు. వీధికి ఒకటి



చొప్పున వెల్డింగ్ ఇన్స్టిట్యూట్లు వెలుస్తున్నాయి. ఆంధ్రాలో కఠిన నియమ నిబంధనలు అమలు చేస్తే ఒరిస్సా సరిహద్దులో ఇన్స్టిట్యూట్‌లు పెడుతున్నారు. స్థానికంగానే ఇంటర్వ్యూ నిర్వహించేస్తున్నారు. స్థానికంగానే మెడికల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఏడాదికోసారి తులసమ్మ సంబరం పేరుతో వీరంతా సిండికేట్‌గా సంబరం నిర్వహించి పెద్దలకు, రాజకీయ నాయకులకు, పోలీసులకు ఆహ్వానం పలికి వారి చెప్పు చేతుల్లో ఉండే విధంగా చేసుకుంటున్నారు. ఇదంతా జరుగుతున్న మోసాలు జరుగుతూనే ఉన్నాయి ఒక్క ఏజెంటు, బ్రోకర్‌ను కూడా అరెస్ట్ చేసి లోపల వేసిన దాఖలాలు లేవన్న విమర్శలు ఉన్నాయి.

శ్రీకాకుళం జిల్లా కి చెందిన వలస కూలీలు పొట్టకూటి కోసం విదేశాలలో వలస కూలీలుగా వెళ్లిన 18మంది మస్కట్ దేశంలో ఇరుకున్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గానికి చెందిన 9మంది వుండగా, కేరళ రాష్ట్రానికి చెందిన వారు 6గురు, ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ముగ్గురు వున్నారు. మస్కట్ దేశంలో నజీమ్ అల్ సలాం ఇంటర్నేషనల్ కంపెనీలో కన్స్ట్రక్షన్ వెల్డింగ్ పనులని వీరిని ఏజెంట్లు నమ్మబలికారు. తీరా అక్కడికి వెళ్లి చూస్తే షిప్ క్లీనింగ్ పనులు అప్పజెప్పారు. జీతాలు, భోజనం కూడా ఇవ్వకుండా తమను పస్తులుంచుతున్నారని బాధితులు వాపోయారు. తమను కోటబొమ్మాళిలో గల ఒక టెక్నికల్ ఇన్స్టిట్యూట్‌తో పాటు ఇచ్ఛాపురం మండలం, ధర్మపురం గ్రామానికి చెందిన ఏజెంట్ పంపారని, తమ పరిస్థితి ఏంటి అని , ప్రశ్నించగా పొంతనలేని సమాధానాలు చెబుతూ కాలం వెళ్లబోస్తున్నారని, ఇప్పుడు మస్కట్ లో తమ వద్ద నుండి పాస్‌పోర్టులు లాక్కొని నడిరోడ్డుపై పెట్టి, ఏమి చేసుకుంటారో చేసుకోండని అంటున్నారని, తాము ప్రస్తుతం చిక్కుల్లో వున్నామని ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు. బాధితులలో దున్న కామరాజు (బూర్జపాడు) దున్న హేమసుందర్ (డోంకురు), జలిది జానీకారావు (డోంకురు), ఏరాలు రామకృష్ణ (శ్రీకాకుళం), బి.దుర్యోధన (సువాని ఒరిస్సా), ఎంపల్ల రాజు (దిబ్బవానిపేట), పిల్ల సతీష్ (వైజాగ్), పిలక భాస్కరరావు(జాడుపుడి), గుజ్జు జగదీశ్ (ఆర్.బెలగం) ఉన్నారు. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ స్పందించి తమకు న్యాయం జరిగేలా చూడాలని వారు సామాజిక మాధ్యమాల ద్వారా కోరుతున్నారు. మస్కట్‌లో వీరంతా చిక్కుకుపోవడంతో వారి కుటుంబీకులు ఆందోళన చెందుతున్నారు.

## క్రైం కార్నర్




### గంజాయితో ఇద్దరి అరెస్టు

**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 17 (వార్త):** ఒడిశాలో కొనుగోలు చేసిన గంజాయిని తమిళనాడుకు అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిని పట్టణ ఎస్సై ముకుందరావు పట్టుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం సర్కిల్ కార్యాలయంలో గురువారం సీఐ ఎం.చిన్నంనాయుడు విలేకరులకు వెల్లడించారు. ఒడిశాకు చెందిన నరేష్ సీథీ, గోపీనాథన్ కొంతకాలంగా తమిళనాడు రాష్ట్రం దిండిగల్ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. అక్కడ గంజాయి వ్యాపారం చేసే లారెన్స్ ప్రధాన్‌తో పరిచయం ఏర్పడింది. కిలోకు రూ.7 వేలు ఇస్తానని చెప్పడంతో ఇద్దరూ ఒడిశాలో మజ్జి అనే వ్యక్తి వద్ద సుమారు 10.5 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. బస్సులో ఇచ్ఛాపురం బస్టాండ్‌కు చేరుకున్నారు. రైలులో తమిళనాడుకు తరలించడానికి సిద్ధమవుతుండగా పట్టణ ఎస్సై, సిబ్బంది పట్టుకున్నారు. వారి వద్ద నుంచి గంజాయి సహా రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దర్నీ అరెస్టు చేశారని సీఐ తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

**సోంపేట:** బేసిరామచంద్రపురం పరిధి జాతీయ రహదారిపై చోటుచేసుకున్న ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన రుద్రశెట్టి (23), బహుళశెట్టి సోదరులు. ప్రకాశం జిల్లాలోని ఓ గ్రానైట్ కంపెనీలో పని చేస్తున్న వీరు ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరారు. బేసిరామచంద్రపురం వద్ద గురువారం విభాగినిని ఢీకొట్టడంతో రుద్రశెట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని సోంపేట సామాజిక ఆసుపత్రికి తరలించారు. మరొకరికి తీవ్ర గాయాలు కావడంతో బ్రహ్మపురలోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అతని పరిస్థితి విషమంగా ఉంది. బారువ ఎస్సై హరిబాబునాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### వంశధార ఉద్యోగి మృతి

**నరసన్నపేట:** వంశధార ప్రాజెక్టు ఉద్యోగి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన నరసన్నపేటలోని మారుతీనగర్-1 చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కొరాయి వెంకటరమణమూర్తి(57) కొంతకాలంగా ఒక్కరే నివసిస్తున్నారు. గత మూడు రోజులుగా ఇంట్లోంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు గురువారం గుర్తించి కుటుంబీకులకు తెలియజేశారు. రమణమూర్తి వంశధార కార్యాలయంలో సహాయకుడిగా పని చేస్తున్నారు. ఆయన భార్య గతంలో చనిపోగా, కుమారుడు అనిల్, కుమార్తె, తల్లి ఉన్నారు. ఆయన స్వస్థలం ఆమదాలవలస మండలం మెట్టక్కివలస కాగా.. తండ్రి ప్రభుత్వ డ్రైవరుగా పని చేస్తూ మృతి చెందటంతో ఆయన వారసత్వంగా వంశధార ప్రాజెక్టులో ఉద్యోగం పొందారు.

### వృద్ధురాలిపై దాడి

**మందస:** సాబకోట పంచాయతీ పరిధి బిత్తరబంద గ్రామానికి చెందిన సవర మల్లి (65) ఇంట్లో నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి ఆమెపై దాడి చేసి కుడి చెవిని కత్తితో కోశాడు. బాధితురాలు కేకలు వేయడంతో దుండగుడు పరారయ్యాడు. తీవ్ర రక్తస్రావంతో బాధపడుతున్న వృద్ధురాలిని హరిపురం ఆసుపత్రిలో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం టెక్కలి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణప్రసాద్ చెప్పారు. బంగారం కోసమే దాడికి పాల్పడివుంటాడని గ్రామస్థులు చెబుతున్నారు.

### డీఎంహెచ్‌వో వెంకటబాలమురళీకృష్ణ సస్పెండ్

**శ్రీకాకుళం:** జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి వెంకటబాలమురళీకృష్ణను సస్పెండ్ చేస్తూ ఆ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 3న రూ.20వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీకి పట్టుబడిన విషయం తెలిసింది. అతనిడి ఈనెల 4న విశాఖపట్నంలోని ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరిచిన అధికారులు, న్యాయమూర్తి ఉత్తర్వుల మేరకు 17వ తేదీ వరకు రిమాండ్‌కు తరలించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ మురళికృష్ణను తాత్కాలికంగా సస్పెండ్ చేసి ప్రధాన కార్యాలయం పరిధిలోనే ఉండాలి, ఎటువంటి ప్రయాణం చేసినా ముందుగానే అనుమతి తప్పనిసరి ఆదేశాలు జారీ చేసింది.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## ఎస్సీ కార్పొరేషన్ రుణాల ఆన్‌లైన్ ప్రారంభం

**పలాస, ఏప్రిల్ 17(వార్త):**ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఆర్థిక రుణాలు సైట్ ఆన్ లైన్ ప్రారంభమైనది. గురువారం నుంచి మే నెల 10 వ తేది వరకు ఆన్లైన్లో అప్లై చేసుకోవచ్చునని పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేనా రామారావు ఒక ప్రకటన తెలియజేశారు. ఆన్లైన్లో వారికి ఇలా ఉండాలని చెప్పారు. లబ్ధిదారుడు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారై ఉండాలిని, కుల ధృవీకరణ పత్రం కలిగి ఉండాలి. లబ్ధిదారుడు ఆంధ్రప్రదేశ్ కు చెంది ఉండాలి. లబ్ధిదారుల వయోపరిమితి 21 నుంచి 50 ఏళ్లు ఉండాలని, లబ్ధిదారుడు దారిద్ర్యరేఖకు దిగువన (బిపిఎల్) కేటగిరీ కింద ఉండాలని, స్వయం ఉపాధి పథకాల రవాణా రంగానికి లబ్ధిదారుడు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, లబ్ధిదారునికి జనరిక్ ఫార్మసీ పథకాలకు డి.ఫార్మసీ/ బి.ఫార్మసీ/ ఎం.ఫార్మసీ ఉండాలని తెలియజేశారు. ఇందుకు ఆధార్ కార్డు ఆధార్ కార్డు లింక్ అయిన ఫోన్ నెంబర్, రేషన్ కార్డు, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని తెలియజేశారు.

## లింగాలవలసలో పలు అభివృద్ధి పథకాలకు శ్రీకారం



**టెక్కలి, ఏప్రిల్ 17(వార్త):** గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందని, ప్రతి పల్లెకు మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తున్నామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. టెక్కలి నియోజకవర్గం పరిధిలోని లింగాల వలస, టెక్కలి ప్రాంతాల్లో గురువారం ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. లింగాలవలసలో రూ.2.30 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం కట్టుబడిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. అదే గ్రామంలో రూ.18.60 లక్షలతో నిర్మించిన జిల్లా పరిషత్ పాఠశాల ప్రహరీ గోడ, రూ.6 లక్షలతో చేపట్టిన సీసీ రహదారిలను ప్రారంభించారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. టెక్కలి టౌన్‌లో రూ.61 లక్షల అంచనా వ్యయంతో అన్న క్యాంటీన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆకలే అర్హతగా.. అన్న క్యాంటీన్లు అన్నార్థులను ఆదుకునే కేంద్రాలుగా రూపుదిద్దుకుంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో కోటబొమ్మాళి మాజీ పిఏసిఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివర ప్రసాద్, టెక్కలి ఆర్టీవో కృష్ణమూర్తి నాయుడు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడులను బలోపేతం చేద్దాం



**పలాస, ఏప్రిల్ 17(వార్త):** పలాస ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పోరాటం చేయడమే కాకుండా ఉపాధ్యాయుల హక్కుల కోసం పోరాటం చేస్తూ బాధ్యతల కోసం కూడా పనిచేస్తున్న సంఘం యుటిఎఫ్ అని జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామమూర్తి అన్నారు. గురువారం కాశీబుగ్గ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా కార్యదర్శి కె రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ప్రాంతీయ సమావేశంలో పలాస, మందస, వజ్రపు కొత్తూరు మండల ఉపాధ్యాయులు సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ విచారంగం పై ప్రభుత్వం చేస్తున్నటువంటి ప్రయోగాల వల్ల నానాటికి విద్యా వ్యవస్థ దిగజారే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కరోనా సమయములో నాలుగు లక్షల మంది పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చేరితే నేడు 10 లక్షల మంది పిల్లలు ప్రభుత్వ పాఠశాలను విడిచిపెట్టి వెళ్లిపోయారు దీనికి ప్రధాన కారణం ప్రభుత్వ విధానాలని జిల్లా అధ్యక్షులు లండ బాబురావు అన్నారు ఒకే మీడియం పాఠశాలలను నిర్వహించడం, 3,4,5 తరగతులు హైస్కూల్ లో కలపడం. నేటి ప్రభుత్వం పరిసర ప్రాంత పాఠశాలలని విలీనం చెయ్యడం,ఇవన్నీ కూడా పాఠశాల మూత వేయడానికి ప్రధాన కారణం అవుతున్నాయని అన్నారు కాబట్టి ప్రభుత్వం వెంటనే విద్యారంగంపై ప్రయోగాలు చేయవద్దని ప్రతి గ్రామంలో కూడా ఒకటి నుంచి ఐదు వరకు ప్రాథమిక పాఠశాల ఉండాలని, యూపీ స్కూల్లు కొనసాగించడం,హైస్కూల్ 6 నుంచి పది వరకు నడపాలని, రెండు మీడియంలో కూడా పాఠశాల లు నిర్వహించాలని సమావేశం తీర్మానించింది ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి గున్న రమేష్, అకడమిక్ సెల్ కన్వీనర్ ఎల్ వి చలం, పలాస అధ్యక్షుడు తమ్మినాన జయరాం, ప్రధాన కార్యదర్శి సిద్దు, డీ జనార్దనరావు, పీ సంజయ్ కుమార్, టీ అప్పారావు పలాస వజ్రపుకొత్తూరు మందస యూటీఎఫ్ నాయకులు హాజరయ్యారు.

## కార్మిక సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలే మార్గం



**పలాస, ఏప్రిల్ 17(వార్త):** ప్రభుత్వ విధానాలు కారణంగా కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి కార్మిక వర్గ ఐక్య పోరాటాలే సరైన మార్గమని పలువురు వక్తలు అన్నారు. కాశీబుగ్గ అక్షర కళాశాల ఆవరణలో సీఐటీయూ పలాస మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం కార్మిక సధస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్ గణపతి, వివిధ కార్మిక సంఘాల నాయకులు యం లావణ్య, బి నిర్మల, పి భూదేవి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల కనీస హక్కులు కాలరాస్తూ కార్పొరేట్లకు దోచి పెడుతున్నాయని అన్నారు. కార్పొరేట్ల లాభాలకు కార్మిక చట్టాలే ఆటంకం అని వాటిని రద్దుచేసి లేబర్ కోడ్ లు తెచ్చి కార్మికుల నెత్తిన బండ మోపారని అన్నారు. కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడం లేదని, పి యఫ్, ఇ యస్ ఐ వంటి కనీస భద్రతా చట్టాలు కల్పించకుండా వెట్టి చాకిరీకి గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎనిమిది గంటల పని దినం స్థానంలో పది గంటలు, పన్నెండు గంటలు పని చెయ్యాలని కార్పొరేట్లు కొత్త నినాదం అందుకుంటే ప్రభుత్వాలు వంతపాడడం ఆశ్చర్యంగా ఉందన్నారు. కార్మికుల హక్కుల సాధనకు, ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మే 20 వ తేదీన దేశ వ్యాప్తంగా సార్వత్రిక సమ్మెకు సిద్ధం అవుతున్నారని, కార్మిక వర్గం ఈ సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమ్మె ద్వారా ప్రభుత్వ విధానాలను తిప్పి కొట్టాలని అన్నారు. కార్యక్రమంలో కాష్యూ యూనియన్ నాయకులు అంబటి ఆనందరావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు పి పద్మావతి,భవాని, యస్ నిర్మల, మధ్యాహ్నం భోజన పథకం కార్మిక సంఘం నాయకులు వై మనమ్మ,పుణ్యావతి,ఆశ యూనియన్ నాయకులు పి పార్వతి,ఐ యజ్ఞ యస్ లలిత,ఎన్ ద్రౌపది,యల్ పుణ్యావతి,,స్కూల్ స్వీపర్స్ యూనియన్ నాయకులు బి స్వాతి,తదితరులు తో పాటు ఆయా సంఘాల కార్మికులు పాల్గొన్నారు.

### సీఐటీయూ మండల కన్వీనర్ గా లావణ్య



సధస్సు అనంతరం సీఐటీయూ మండల కన్వినింగ్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కన్వినర్ గా యం లావణ్య, కమిటీ సభ్యులుగా ఎ ఆనందరావు, బి శశిరేఖ, ఐ యజ్ఞ, బి నిర్మల, యస్ లలిత, బి తిరుపతి, కె వెంకటి,టి సింహాద్రి, బి స్వాతి తదితరులుతో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## మున్సిపాలిటీలో తాగునీటి సమస్య పరిష్కరించాలి

**-ఎమ్మెల్సీ నర్తు రామారావు**




**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 17(వార్త):** ప్రభుత్వం తీసుకునే చర్యలు ప్రజాహితం కావాలని, కేవలం ఆర్భాటాలు కాకూడదని శ్రీకాకుళం శాసనమండలి సభ్యులు నర్తు రామారావు అన్నారు. ఆయన స్థానిక మునిసిపల్ చైర్ పర్సన్ పిలక రాజ్యలక్ష్మితో కలిసి గురువారం ఆమె చాంబర్లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అంశాలను ప్రస్తావించారు. మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్య అధికంగా ఉందని, ప్రభుత్వం పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. వంశధార నది జలాలను బహుద నదికి అనుసంధానం చేస్తానని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. వంశధార నది జలాలు నియోజకవర్గానికి చేరితే ఒకవైపు తాగునీటి సమస్యతో పాటు మరోవైపు సాగు సమస్య కూడా పూర్తవుతుందని తెలిపారు. నియోజక వర్గంలో రైతాంగం ఎన్నో సమస్యలను ఎదుర్కొంటుందని ఏకరువు పెట్టారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఈ ఏడాది జీడి, మామిడి, పనస ఉద్యాన పంటలు సర్వనాశనం అయ్యాయని తెలిపారు. ఈ మధ్య కాలంలో రైతుల ఆత్మహత్యలను నియోజకవర్గంలో చూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకునే విధంగా తక్షణ చర్యలకు ఉపక్రమించాలని కోరారు. ఈ మధ్యకాలంలో జల వనరుల శాఖ అధికారులు నియోజకవర్గంలో క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తున్నట్టు వార్తలు చూస్తున్నామని, ఆ పరిణామాన్ని ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. శాసనమండలి వేదికగా నదుల అనుసంధానం పైన, నియోజకవర్గ రైతాంగ సమస్యల పైన మాట్లాడానని.. దాని ప్రాప్తికి అధికారులు క్షేత్రస్థాయిలో చేస్తున్న పర్యటనలు సంతోషాన్ని కలిగిస్తున్నాయని రామారావు అన్నారు. ఇవి కంటి తుడుపు చర్యలుగా కాకుండా, చిత్తశుద్ధి కలిగిన పనులుగా నిర్వహించాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలోబచ్చు జగన్, చల్ల దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## అలరించిన నాట్య ప్రదర్శన

**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 17(వార్త):** పురుషోత్తపురం పుష్పగిరి కొండపై వెలసి ఉన్న భగవాన్ షిరిడి సాయిబాబా దేవాలయం 25వ వార్షికోత్సవ సందర్భంగా ఏర్పాటుచేసిన వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ ఇచ్చాపురం చిన్నారుల కూచిపూడి శాస్త్రీయ నృత్యాలు అందరినీ అలరించాయి. అకాడమీ అధ్యక్షుడు చిన్నా గురుస్వామి, నాట్య గురువులు శృతి పట్నాయక్. దట్టి కావ్య, నీలాపు శైలు, సిల్లాపూజ ,చాట్ల జయలక్ష్మి , కొరివి జాగృతి, నీలాపు ప్రీతి, బుడపు లిఖిత, అంబటి సంజన, నీలాపు స్రవంతి. ఆసి దీపిక, సింహాద్రి రమ్యశ్రీ, పఠాన ప్రణవి, నీలాపు నీహారికలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి శ్రీనివాసనంద సంస్వతి, భక్తులు చిన్నారులను అభినందించారు ఆలయ ధర్మకర్త ఉప్పాడ కృష్ణ సాయి, ఆలయ కమిటీ చిన్న గురుస్వామి, చిన్నారులను సత్కరించారు.

## నేడు బెల్లుపడ యజ్ఞం జలయాత్ర



**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 17(వార్త):** బెల్లుపడ గ్రామం లో శుక్రవారం జరగబోయే శ్రీ తారక రామ మహా యంత్ర సహిత పంచ కుండాత్మక మహాయజ్ఞం కోసం జలయాత్ర నిర్వహిస్తున్నట్లు కమిటీ తెలిపింది. మధ్యాహ్నం 2.30 కు బెల్లుపడ నుండి కార్జివీధి, మార్కెట్ రోడ్, మెయిన్ రోడ్ మీదగా బహుదా నది నుండి పవిత్ర జలాలు తేవడం జరుగుతుందని చెప్పారు.

## ఘనంగా పంజా వీధి పాఠశాల వార్షికోత్సవం



**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 17(వార్త):** పురపాలక పంజా వీధి ప్రైమరీ పాఠశాలలో 78 వార్షికోత్సవం ఘనంగా జరిగింది, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగ మాజీ ప్రిన్సిపాల్ గౌరీశంకర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు ధనలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ దొర బాబు రెడ్డి, పేరెంట్స్ కమిటీ మెంబర్లు, పేరెంట్స్ పెద్ద ఎత్తున పాల్గొన్నారు, పూర్వ విద్యార్థి శాసనపూరి నాగేశ్వర రావు కంపర్సు బాక్స్ లు పంచారు. ,పూర్వ విద్యార్థి, తెల్లి కోదండరావు మజ్జిగ అందించారు. యం.డి.యం.సిబ్బంది, స్కూల్ సిబ్బంది, టీచర్లను శాలువాలుతో ఘనంగా సన్మానించారు.

## వైభవంగా బాబా ఆలయ 25వ వార్షికోత్సవం

**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 17(వార్త):** స్థానిక పురుషోత్తపురం పుష్పగిరి షిరిడి సాయిబాబా మందిరం 25 వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. విశేష పూజలు, హారతులు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు .నగర సంకీర్తన నిర్వహించారు తిరువీధి కార్యక్రమం జరిగింది .సంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అన్నదాన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు స్వామీజీ ప్రవచనాలు ఆకట్టుకున్నాయి.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# 22న జడ్పీస్థాయీ సంఘాల సమావేశాలు

**శ్రీకాకుళం, ఏప్రిల్ 17(వార్త):** జిల్లా ప్రజా పరిషత్ స్థాయి సంఘముల సమావేశాలు 2025 ఏప్రిల్ 22వ తేది మంగళవారం నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎల్.ఎన్.వి.శ్రీధర్ రాజా పేర్కొన్నారు.

ఈ మేరకు గురువారం ఒక ప్రకటన జారీచేసారు.

ఈ నెల 22వ తేదీన జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గం.లకు స్థాయి సంఘాల సమావేశం ప్రారంభం అవుతాయన్నారు.

ఉదయం 10.30 గం.లకు 2,4,1,7 స్థాయి, మధ్యాహ్నం 3.00 గం.లకు 6వ స్థాయి, 4.00 గం. లకు 3వ స్థాయి, సాయంత్రం 5.00 గంటలకు 5వ స్థాయి సంఘాల సమావేశాలు జరగనున్నట్లు ఆయన ఆ ప్రకటనలో వివరించారు. సభ్యులు హాజరు కావాలని కోరారు.



## నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు


**మందస, ఏప్రిల్ 17(వార్త):** మందస మండలంలో నాటుసారా తయారు చేస్తున్న కేంద్రాలపై ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ సోంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ కె.బేబీ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. నవోదయం 2.0లో భాగంగా అసిస్టెంట్ కమీషనర్ ఎన్ఫోర్స్మెంట్ ఇన్చార్జ్ ఏఈఎస్ ఎం.శ్రీనివాసరావు(శ్రీకాకుళం), ఏఈఎస్టీఎఫ్ పలాస టీం, మొబైల్ పెట్రోలింగ్ పార్టీ సీఐ జీవీ రమణలతో పాటు ఆయా సిబ్బంది మండలంలోని సవర మధ్య, పిడిమందస ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. నాటుసారా తయారు చేస్తున్న పొయ్యిలను, 1000 లీటర్ల పులిసిన బెల్లం ఊటలను వీఆర్వో గౌరి, సర్వేయర్ దివాకర్ల సమక్షంలో ధ్వంసం చేశారు. నాటుసారా పొయ్యిలున్న భూములు సవర బాణమ్మదిగా గుర్తించి, ఇన్వాల్వ్ చేయడం జరిగిందని సీఐ బేబీ చెప్పారు. బుడంబో ప్రాంతంలో ఏఈఎస్టీఎఫ్ పలాస టీం సిబ్బంది దాడులు చేసి, 16లీటర్ల నాటుసారా సీజ్ చేశారని చెప్పారు. తెలుకల కృష్ణారావు, బమ్మిడి కామరాజును అరెస్ట్ చేసి, రిమాండ్ కు తరలించామని ఆమె తెలిపారు.

## నేత్ర వైద్య శిబిరం విజయవంతం



**పలాస, ఏప్రిల్ 17(వార్త):** జిల్లా ఆంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో మరియు శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి, విశాఖపట్నం వారి సహకారంతో పలాస సత్య సాయి మందిరం లో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 104 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 62 మందికి కంటి శుక్లాల ఆపరేషన్ నిమిత్తం, ఎంపిక చెయ్యడం జరిగింది. శంకర్ ఫౌండేషన్ ఆప్తాల్మలజీ నిపుణులు బృందం సురేష్, యశస్విని, ఉష, నేత్రవైధ్యాధికారి రోణంకి వెంకటరమణ కంటి పరీక్షలు నిర్వించారు. క్యాంపు మేనేజర్ సురేష్, సత్యసాయి మందిర్ కన్వీనర్ ఇప్పిలి తిరుమలరావు, కోఆర్డినేటర్స్ బి కామేశ్వర్రావ్, పి శ్రీనివాసరావు, సభ్యులు. డి జగదీశ్, కృష్ణ స్వామి, మల్ల శరత్ బాబు, పి కౌంతేయదు, పి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.సత్య సాయి సేవా సమితి తరుపున శిబిరం కి వచ్చిన వారికి ఉచిత భోజనం అందజేశారు .సభ్యులు సేవనిరతి ఆదర్శప్రాయంని, ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆరోగ్య శ్రీ శిభిరం కు ప్రజలు నుండి మంచి స్పందన వచ్చింది.

## ముఖ్యమంత్రి సహాయ నిధి పంపిణీ



**సరుబుజ్జిలి, ఏప్రిల్ 17(వార్త):** తెలికిపెంట గ్రామంలో గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న చెక్కు క్రిష్ణమ్మ మనవరాలు చెంచాల లక్ష్మికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఎమెఓఫ్ట్మ్యే కూన రవికుమార్ సహకారం తో నాలుగు లక్షల ఎబైవేలు రూపాయలు చెకుక్ర మంజూరైంది. దీనిని గురువారం ఎమ్మెల్యే సతీమణి ప్రమీల ఆ కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నందివాడ రాజ్యలక్ష్మి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు నందివాడ గోవిందరావు మండల పార్టీ అధ్యక్షుడు రాంబాబు, గ్రామ కమిటీ అధ్యక్షులు నందివాడ క్రిష్ణా రావు అరసవెల్లి సన్యాసి రావు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## ఈవీఎంల భద్రతపై నోడల్ అధికారి సంతృప్తి

**శ్రీకాకుళం, ఏప్రిల్ 17(వార్త):** ఈవీఎంల భద్రతా ఏర్పాట్లపై మాసాంతపు తనిఖీల్లో భాగంగా గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని ఈవీఎం గోదామును రాష్ట్ర ఈవీఎం నోడల్ అధికారి కె. విశ్వేశ్వరరావు (ఉప ముఖ్య కార్యనిర్వాహక అధికారి, ప్రభుత్వ ఉప కార్యదర్శి) పరిశీలించారు. ఈ సందర్భంగా గోదాములో అమలులో ఉన్న ట్రిపుల్ లాక్ విధానం, 24 గంటల సీసీటీవీ పర్యవేక్షణ, భద్రతా వ్యవస్థలను, సిబ్బంది విధులు, హాజరును ఆయన సమీక్షించారు. ఈవీఎంల భద్రత, రికార్డు నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ తనిఖీలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరై భద్రతా ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియ పట్ల నమ్మకం కలిగేందుకు ఇటువంటి తనిఖీలు అవసరమని వారు అభిప్రాయపడ్డారు. తనిఖీ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి యం.వెంకటేశ్వరరావు, ఎన్నికల విభాగపు అధికారులు, ఇంజినీరింగ్ విభాగానికి చెందిన సిబ్బంది పాల్గొన్నారు.



# అమరావతి పేరుతో సీఎం భారీ దోపిడీ

**మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు**

**పలాస, ఏప్రిల్ 17(వార్త):** అమరావతి నిర్మాణం పేరిట భారీ దోపిడీకి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెర లేపారని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మండిపడ్డారు. గురువారం పలాస ప్రగతిభవంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విచ్చలవిడిగా అవినీతి, రాజధాని రైతులకూ అన్యాయమే, రాష్ట్రానికీ అన్యాయమే -తమ జేబులు నింపుకోవడంకోసం విపరీతంగా అంచనాలు పెంచి టెండర్లు ఖరారుచేశారు కావాల్సిన కంపెనీలకు కట్టబెట్టారు. దేశంలో ఇంతటి అవినీతి ఎక్కడా చూడలేదు-గతంలో రూ.2,700 కోట్లయ్యే సచివాలయానికి ఇప్పుడు -రూ.4,700 కోట్లా?



అమరావతిలో ఆరోజు పనులకు రూ.44వేల కోట్ల అంచనాలు, ఇప్పుడు రూ.77వేల కోట్లా?75శాతం అంచనాలు పెంపు ఎక్కడైనా జరిగిందా? అంటూ ప్రశ్నించారు. ప్రపంచంలో ఇలాంటి దోపిడీని ఎక్కడైనా విన్నామా? చూశామా ఇంత దారుణమైన దోపిడీని ఎన్నడైనా చూశామా? దోపిడీ కోసమే జ్యుడిషియల్ ప్రివ్యూ, రివర్స్ టెండరింగ్ రద్దుమొబలైజేషన్ అడ్వాన్స్ పేరిట ముందస్తు దోపిడీ చేయడానికి కుట్రపనిట్ల కూటమి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని అన్నారు. ఇతర ప్రాంతాల్లో వైయస్సార్‌సీపీ అభివృద్ధి పనులను పూర్తిగా గాలికొదిలేశారని మండిపడ్డారు.విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలను గాలికొదిలేసి కమీషన్ల వేటలో పడ్డారని ఆరోపించారు.ప్రజలను మళ్లీ కష్టాల్లోకి నెట్టారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ పెద్దలు మాత్రం జల్సాలు చేస్తున్నారని ఆరోపించారు.

# చుక్క నీటి బిందువు వృథా కాకూడదు

**-ప్రతి ట్యాంకర్ ద్వారా మంచినీరు**

**సక్రమంగా సరఫరా జరగాలి**

**-పలాస మున్సిపల్ కమిషనర్ రామారావు**

**పలాస, ఏప్రిల్ 17(వార్త) :** నీటి బిందువు చాలా విలువైందని, చుక్కనీరు కూడా వృధా పోకుండా చూడాలని పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేనా రామారావు అన్నారు. గురువారం తన కార్యాలయంలో అధికారులు, కాంట్రాక్టర్లు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో ఏర్పడిన మంచినీటి ఎద్దడి తీవ్రత దృశ్యా ఈ పురపాలక సంఘంలో ట్యాంకర్ల ద్వారా జరుగుతున్న నీటి సరఫరా సక్రమంగా జరగాలని ఆదేశించారు. ట్యాంకర్ల ద్వారా పంపిణీ జరుగుతున్న మంచినీరు ప్రతి ఒక్క ఇంటికి సక్రమంగా అందేటట్లు చూడాలని ఇందులో ఎలాంటి అవకతవకలు, పొరపాట్లు జరిగినా



సహించేది లేదని హెచ్చరించారు. ట్యాంకర్ ద్వారా నీటిని ఇచ్చే సమయాన్ని ప్రతి ఉద్యోగి కూడా ఖచ్చితంగా వారికి ఇచ్చిన ఆదేశాలు పాటించాలని తెలియజేశారు. ఈ సమావేశంలో మంచినీటి సరఫరా కొరకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బృంద పర్యవేక్షణ అధికారులు, లైజరింగ్ అధికారులు, ఔట్సోర్సింగ్ సిబ్బంది, ట్యాంకర్ల డ్రైవర్లు, మంచినీటి సరఫరా కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# మెగా జాతీయ లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలి



**పలాస, ఏప్రిల్ 17(వార్త):** మెగా జాతీయ లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవా అధికారి, సివిల్ జడ్జి యు మాధురి తెలిపారు. గురువారం పలాస కోర్ట్ ప్రాంగణంలో న్యాయ వాదులు, పోలీస్ సిబ్బంది, ఎక్సైజ్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మే 10న పలాస కోర్టు ప్రాంగణంలో జాతీయ లోకదాలత్ రాష్ట్ర జిల్లా న్యాయ సేవ అధికార సంస్థల ఆదేశాలపై నిర్వహించబోతున్నామని, ఈ జాతీయ లోక్ అదాలత్ లో రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, అన్ని సివిల్ కేసులు, భార్య భర్తల కేసులు, వరకట్న నిషేధ కేసులు, మనోవర్తి కేసులు అదే విధంగా చెక్ బౌన్స్ కేసులు కూడా రాజీ చేస్తామని న్యాయమూర్తి తెలిపారు. 10-05-2025 ఎక్కువ సంఖ్యల కేసులు రాజీ చేసే విధంగా ప్రతి ఒక్కరూ చర్యలు చేపట్టాలని న్యాయమూర్తి విజ్ఞప్తి చేశారు. పలాస వజ్రపుకొత్తూరు ప్రాంతాలలో గల కక్షిదారులు అందరూ కూడా వారికి గల పెండింగ్లో గల కేసులను ఎక్కువ సంఖ్యలో రాజీ చేసుకొని ఈ జాతీయ లోక్ అదాలత ను సద్వినియోగం చేసుకోవాలని న్యాయమూర్తి సూచించారు. పలాస న్యాయవాదులందరూ కూడా వారికి రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులను సివిల్ కేసులను మనోవర్తి కేసులను అదేవిధంగా చెక్ బౌన్స్ కేసులను ముందుగానే గుర్తించి కోర్టు వారికి తెలిపిన యెడల వారందరికీ కూడా ముందుగానే , ప్రీ లోకదాలతో ( ముందస్తు లోక్ అదాలత్) చర్చలు జరిపి ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ చేయగలుగుతామని న్యాయమూర్తి తెలియజేశారు .పోలీసు అధికారులు సిబ్బందితో న్యాయమూర్తి మాట్లాడుతూ రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు అన్నిటిని కూడా ముందుగానే గుర్తించాలని పార్టీలందరికీ కూడా నోటీసులను అందజేసి వారు కూడా ముందుగానే ముందస్తు లోక్ అదాలత్ లకు హాజరై, చర్చలు జరిపి కేసులను రాజీ చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎక్సైజ్ సిబ్బందికి కూడా రాజీ పడదగ్గ ఎక్సైజ్ కేసులను సత్వరమే గుర్తించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలాస ఏ పి పి రమేష్, పలాస న్యాయ వాద సంఘ న్యాయవాదులు బి కే ఆర్ పట్నాయక్, బి కాళిదాసు, సిహెచ్ ఎర్రన్న, జి ప్రభాకర రావు, కె రజనీ కుమార్, బి రవి, టి శ్యాంసుందర్, జి ఎం ఎస్ అనిల్‌రాజు, ఎక్సైజ్ సీఐ కె మల్లికార్జునరావు,పలాస ఎస్ ఐ ఎం.చంద్రరావు, పలాస ఎస్సై కె జిన్నారావు, వజ్రపుకొత్తూరు, కోర్ట్ కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

# కె.నారాయణ హైస్కూల్‌లో అగ్నిమాపక వారోత్సవాలు

**మందస, ఏప్రిల్ 17(వార్త):** అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా మందస మండలంలోని కుంటికోట గ్రామంలో గల కె.నారాయణ హైస్కూల్ లో ప్రమాదాలపై అవగాహన కల్పించిన అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ పలాస ఎస్ హెచ్ఓ సోమేశ్వరరావు ఆధ్వర్యంలో కుంటికోట నారాయణ హై స్కూల్ ప్రాంగణంలో విశేష అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది వివిధ రకాల అగ్నిప్రమాదాలు, వంటగదిలో గ్యాస్ సిలిండర్ లీకేజీ, బట్టలు అంటుకోవడం, మంటల్లో చిక్కుకోవడం మొదలైన సందర్భాలలో తీసుకోవాల్సిన అత్యవసర నివారణ చర్యలను ప్రాక్టికల్ గా ప్రదర్శిస్తూ విద్యార్థులకు విపులంగా వివరించారు. అగ్నిమాపక సిబ్బంది ప్రదర్శించిన చర్యలను విద్యార్థులు ఆసక్తిగా తిలకించి, ప్రమాద సమయంలో ఎలా స్పందించాలో, స్వీయ రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన పొందారు. సందర్భంగా సోమేశ్వరరావు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ధైర్యాన్ని, అవగాహనను పెంచి, భవిష్యత్తులో అగ్నిప్రమాదాలను సురక్షితంగా ఎదుర్కొనడానికి ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కుంటికోట నారాయణ హై స్కూల్ నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థులకు ప్రాముఖ్యతను తెలియజేసేలా, సమాజంలో బాధ్యతాయుతంగా ఎదగడానికి మార్గనిర్దేశకంగా నిలిచిందన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

**శ్రీకాకుళం, ఏప్రిల్ 17(వార్త):** విద్యా హక్కు చట్టం ప్రకారం 2025-2026 విద్యా సంవత్సరానికి గాను, అన్ని ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తర గతిలో ప్రవేశానికి ఈ నెల 19 నుంచి పాఠశాలలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా విద్యా శాఖ వర్గాలు తెలిపాయి. ఈ నెల 28 నుంచి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థులఆధార్ ద్వారా, ప్రాథమిక వివరాలతో https://cse.ap.gov.in వెబ్సైట్ నందు రిజిస్టర్ చేసుకోవచ్చు. విద్యార్థుల తల్లిదండ్రులు, సంబంధిత గ్రామ సచివాలయం మండల విద్యావనరుల కేంద్రం/సంబంధిత పాఠశాల నుండి దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హులైన విద్యా ర్థులకు లాటరీ ద్వారా సీట్లు కేటాయింపు జరుగుతుంది. ఇతర విషయాలకు సం బంధిత మండల విద్యాశాఖాధికారి సంప్రదించవచ్చు లేదా సంబంధిత పాఠశాలలు వెబ్సైట్లో చూడవచ్చునని జిల్లా విద్యాశాఖాధికారి తెలిపారు. టోల్ ఫ్రీ నెంబర్: 18004258599. జిల్లా నోడల్ ఆఫీసర్ వారి ఫోన్ నెంబర్: 9703585990

# ఆకలే అర్హతగా రూ.5కే భోజనమందిస్తాం

## -మంత్రి అచ్చెన్నాయుడు

**టెక్కలి, ఏప్రిల్ 17(వార్త):** "పేద-ధనిక తేడా లేదు.. ఆకలే ఒక్కటే అర్హత. అల్పాహారం గానీ, భోజనం గానీ రూ.5కే అందిస్తాం" అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. టెక్కలి పట్టణ కేంద్రంలో రూ.61 లక్షలతో నిర్మించనున్న అన్న క్యాంటీన్ నూతన భవనానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... "ఆకలి తీర్చే ఆలయాలుగా రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లను అభివృద్ధి చేస్తున్నాం. పేదల కడుపు నింపాలన్నదే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. టెక్కలిలోని క్యాంటీన్‌ను మోడల్ క్యాంటీన్‌గా తీర్చిదిద్దుతాం. నాణ్యతతో ఆహారం అందిస్తాం. ఎవ్వరూ ఆకలితో ఉండకుండా చూడటమే మా బాధ్యత" అన్నారు.



అన్న క్యాంటీన్ భవనం పూర్తి స్థాయి వసతులతో ఉంటుంది. వంటశాల, భోజనాల గది, నిల్వ గదులు, పరిశుభ్రత కోసం ప్రత్యేక ఏర్పాట్లు ఉంటాయని అధికార వర్గాలు పేర్కొన్నాయి.ఈ కార్యక్రమంలో కోటబొమ్మాలి మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్, టెక్కలి నియోజకవర్గం నుండి పెద్దఎత్తున కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కొత్త క్యాంటీన్ ప్రారంభంతో పేదలకు భోజనం చేరువవుతుందన్న అభిప్రాయాన్ని వారు వ్యక్తం చేశారు.

## సమగ్ర విచారణ చేసి

# భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



**పలాస, ఏప్రిల్ 17(వార్త) :** భూకబ్జాలపై సమగ్ర విచారణ చేసి భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని వైసిపి నాయకులు డిమాండ్ చేశారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పలాస తహసిల్దారు టి కళ్యాణ చక్రవర్తికి వినతిపత్రం గురువారం అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు భూ అక్రమణలు చేసి ఉన్నారని నిన్నటిదినం పలాస తెలుగుదేశం పార్టీ వారు తమరికి ఫిర్యాదు చేశారని, దీనిని మేము చాలా శుభ పరిణామంగా భావిస్తూన్నామరు. దీనికి కొనసాగింపుగా పట్టణ వైయస్సార్ కాంగ్రెసు పార్టీ తరఫున పట్టణంలో జరుగుతున్న టిడిపి నాయకుల భూ ఆక్రమణలను తమరు ముందు ఉంచుతున్నాం. వీటిపైన సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరుచున్నామని అన్నారు. భూ ఆక్రమణల వివరములు పలాస పరిధి పురుషోత్తపురం రెవిన్యూ గ్రామ పరిధిలో సర్వేనెంబర్ 51 సుమారు నాలుగు ఎకరాలు భూమిని పట్టణ టిడిపి నాయకులు పద్మనాభపురం సర్వేనెంబర్ 395/1, 362/2%దీ , 362/7గా% నంబర్లలో తప్పుడు రిజిస్ట్రేషన్లు చేసి ఉన్నారు, అలాగే కాశీబుగ్గ సర్వేనెంబర్ 234/1 తప్పుడు రిజిస్ట్రేషన్ చేసి పురుషోత్తపురం సర్వేనెంబర్ 51 యొక్క ప్రభుత్వ భూమిని ఫ్లాట్లుగా మార్చి అమ్మేసి ఉన్నారు. పలాస పరిధి అనంతపురం గ్రామ పరిధి సర్వే నంబర్ 253 లో ఉన్న సుమారు 40 సెంట్లు శనీశ్వరుడు కొండ భాగాన్ని కిడ్నీ ఆసుపత్రి దగ్గర సత్యసాయి భవనంకు ఎదురుగా కొండ భాగాన్ని కంకర తవ్వి చదును చేసి టిడిపి నాయకుడు తన బంధువులు,మిత్రులు పేరున పక్కన నెంబర్ వేసి రిజిస్ట్రేషన్ చేసి కోట్లాది రూపాయలు సొమ్ము చేసుకుని ఉన్నారు. సదరు భూమి పైన సమగ్ర విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. పలాస పరిధి పద్మనాభపురం రెవిన్యూ సర్వేనెంబర్ 362/5 సూది కొండ నుండి పద్మనాభపురం సమీపం గుండా ఏఎంసి గోడౌన్ వెనుక భాగం నుండి పద్మనాభపురం తాళ్ళ చెరువుకు వెళ్లే వరద కాలువ సుమారు 2 ఎకరాల 31 సెంట్లు ప్రభుత్వ భూమిని కొంతమంది టిడిపి నాయకులు ఆక్రమణ చేసి ఫ్లాట్లుగా మార్చి చాలామందికి అమ్మివేసి కోట్లాది రూపాయలు దండు కొన్నారు. ఇదివరకు నాటి టెక్కలి సబ్ కలెక్టర్ వికాస్ మర్మత్ స్వాధీనం చేసుకుని అది ప్రభుత్వ భూమని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అయినను సదరు భూములో హెచ్చరిక బోర్డులను తొలగించి మరల వారి ఆధీనంలో ఉంచుకొని ఉన్నారు. సదరు భూమిపైన సమగ్ర విచారణ జరిపి సదరు భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని పట్టణ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున కోరుచున్నాం. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గోపి, వైసిపి నాయకులు బత్తిన హేమేశ్వరరావు, అంబటి ఆనంద్, బమ్మిడి సంతోష్, తూముల శ్రీనివాసరావు, బమ్మిడి దుర్యోధనరావు, దువ్వాడ రవి, కంచరాన భాస్కరరావు, తూముల.శ్రీనివాస్ గోందు మోహన్, గుజ్జు జోగారావు, వాయలపల్లి లక్ష్మణ్, బోనెల రవి, నర్తు వెంకటరమణ, నెయ్యల శివ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం హర్షనీయం

**ఆమదాలవలస, ఏప్రిల్ 17(వార్త):** ఎస్సీ వర్గీకరణ బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలపడం హర్షనీయమని దళిత సంఘాల నాయకులు అన్నారు. ఎస్సీ కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బోనెల అప్పారావు, జిల్లా విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ మెంబర్ తోట రాము ఆధ్వర్యంలో నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో గురువారం ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ దళితుల అభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబు,కూటమి ప్రభుత్వంతో నే సాధ్యమని రుజువు చేసి చూపించారన్నారు. గతంలో రాజీవ్ రంజాన్ మిశ్రా ఇచ్చిన నివేదిక, దానిపై మంత్రుల కమిటీ ఇచ్చిన నివేదికపై కేబినెట్ చర్చించిందని, వీటి ప్రకారం 200 పాయింట్ల రోస్టర్ అమలుకు నిర్ణయించిందన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీలు జనాభా 1 కోటి 38 లక్షల 78,078 వీరిలో మాదిగలు 67 లక్షల 2 వేల 609 ఉన్నారని, ఎస్సీ లు 55 లక్షల 70 వేల 244 మంది ఉన్నారన్నారు. ఎస్సీ వర్గీకరణకు దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆమోదం తెలపడంతో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వర్గీకరణ అమలు చేసే దిశగా మంత్రి మండలి ఆమోదం



తెలిపిందని అభినందనలు చేశారు. వర్గీకరణ ద్వారా ఎస్సీల్లో అన్ని వర్గాల వారికి ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. అత్యంత వెనుకబడిన రెల్లి, 12 ఉప కులాలు మొదటి గ్రూపులో చేర్చి ఒక శాతం రిజర్వేషన్లు, మాదిగ ఉప కులాలు 18 రెండో గ్రూపుగాను చేర్చి 6.5 శాతం రిజర్వేషన్లు, మాల వాటి 29 ఉప కులాలు ఉన్నాయని వాటికి 7.5 శాతం రిజర్వేషన్లు అమలు చేసేలా ఆమోదం తెలిపేరని గుర్తు చేశారు. అన్ని జిల్లాల్లో ఈ ఆర్డినెన్స్ అమల్లోకి వస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసినట్లు తెలిపారు. ఈ వర్గీకరణ వల్ల ఎస్సీ మహిళ వర్గాల వారికి ప్రయోజనం చేకూరుతుందని ఆనందం వ్యక్తం చేశారు ఈ సమావేశంలో మైనార్టీ సంఘం నాయకులు రాడ విజయ్ కుమార్ పొన్నాన అప్పలసూరి గొల్లపల్లి సింహాద్రి నవిరి చిన్నారావు పలు దళిత సంఘాల నాయకులు, టీడీపీ దళిత కమిటీ నాయకులు పాల్గొన్నారు. అంతకు ముందు పార్టీ కార్యాలయంలో గల ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.




# న్యాయసేవలు అందరికీ అందాలి

**శ్రీకాకుళం, ఏప్రిల్ 17(వార్త):** "న్యాయసేవలు అందరికీ అందాలి. ఖైదీలు తమ హక్కులను తెలుసుకుని, సద్వినియోగం చేసుకోవాలి," అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు పేర్కొన్నారు. గురువారం ఆయన అంపోలు వద్ద ఉన్న జిల్లా జైలును సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడిన ఆయన, సత్ప్రవర్తన ప్రదర్శించాలన్న దిశగా సూచనలు ఇచ్చారు. న్యాయవాదుల సహాయం లేని ఖైదీలకు ప్రభుత్వ న్యాయవాదుల సేవల గురించి వివరించి, బెయిల్ పిటిషన్లు ఎలా దాఖలు చేయాలో అవగాహన కల్పించారు. ఖైదీల ఆరోగ్య పరిస్థితులు, ఆహార నాణ్యతను పరిశీలించి, జైలు పరిసరాలను పరిశీలించి సంబంధిత అధికారులకు తగిన సూచనలు అందజేశారు. రానున్న జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్, సివిల్ కేసులను రాజీద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఖైదీలు, ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అడ్వకేట్ జి.ఇందిరా ప్రసాద్, జైలర్ దివాకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా మహిళల క్రెడిట్ ప్లాన్



**మందస, ఏప్రిల్ 17(వార్త):** జీవనోపాధుల క్రెడిట్ ప్లాన్ పక్కా పారదర్శకంగా సంఘ సభ్యులందరికీ తెలిసేలా ఉండాలని వెలుగు ఐటిడిఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. మందస పంచాయతీ పరిధిలో కిళ్ళమ్మవీధి, సెగిడివీధులలో జరుగుతున్న యాక్షన్ ప్లాన్ సర్వేను వారి సంఘం తీర్మానం, సభ్యురాలు వారీ పొదుపు, అప్పులు, సంఘం వారీ పొదుపులు, అప్పుల వివరాలను సంగ్రహ పట్టిక ఆధారంగా పరిశీలించారు. గ్రామంలో ప్రతీ కుటుంబానికి తమ జీవనోపాదులను మెరుగుపరుచుకోవడానికి చేపట్టిన క్రెడిట్ ప్లాన్ తయారీను పరిశీలిస్తూ మాట్లాడారు. 2025-26వ ఆర్థిక సంవత్సరంలో తీసుకున్న రుణం నుండి కనీసం 70 శాతం ఆదాయాభివృద్ధి కార్యక్రమాలకు మాత్రమే వినియోగించాలని తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ కోఆర్డినేటర్ స్వామినాయుడు, వి.వో.ఏ. శోభారాణితో పాటు ఎన్యూమేరేటర్లు పాల్గొన్నారు.

# రహదారి నిబంధనలను తప్పక పాటించాలి



**లమందస, ఏప్రిల్ 17(వార్త):** మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన భేతాళపురంలో కాశీబుగ్గరూరల్ సీఐ తిరుపతిరావు, మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ స్థానికులను అప్రమత్తం చేశారు. ప్రజలతో ఏర్పాటు చేసిన సంకల్పం సమావేశంలో వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రహదారి నిబంధనలను తప్పక పాటించాలని కోరారు. మైనర్లు వాహనాలను నడపవద్దని, మద్యం తాగి వాహనాలను నడపరాదన్నారు. ఇటీవల సవరించిన నిబంధనలతో భారీగా జరిమానాలు వేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా సైబర్ క్రైం పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. తెలియని ఫోన్ నంబర్ల నుంచి ఆధార్ కార్డ్ వివరాలు, బ్యాంక్ ఖాతాల వివరాలను అడిగితే ఎట్టి పరిస్థితుల్లో స్పందించవద్దన్నారు. సైబర్ నేరగాళ్లు ఎంతో తెలివిగా వ్యవహరించి, బ్యాంక్ ఖాతాలను ఖాళీ చేస్తున్నారన్నారు. మహిళల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని కోరారు. గ్రామాల్లో వివాదాలు సృష్టించవద్దని, స్నేహభావంతో మెలగాలన్నారు. కార్యక్రమంలో కె.ఢిల్లేశ్వరరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు బహుమతులు

**శ్రీకాకుళం, ఏప్రిల్ 17(వార్త):** ప్రభుత్వ మహిళ కళాశాల అటానమస్ శ్రీకాకుళం , డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సర వార్షిక పరీక్షలలో టాపర్స్ వచ్చిన విద్యార్థులకు కామర్స్ డిపార్ట్మెంట్ వారు గోల్డ్ మరియు సిల్వర్ బహుమతులతో సత్కరించడమైనది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. సూర్యచంద్రరావు, హెచ్ ఓ డి ఎల్.కృష్ణారావు, వైస్ ప్రిన్సిపాల్ పైడి శంకర్ నారాయణ, ఐక్యుఏసి కోఆర్డినేటర్ పద్మావతి, అకాడమిక్ కోఆర్డినేటర్ చింతాడ కృష్ణారావు, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఎతి టి.ఆదిలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ మోహన్‌రాజు పాల్గొని విద్యార్థులను అభినందించారు. కామర్స్ అధ్యాపకురాలు లలితాబాయ్, సంతోషి పట్నాయక్, పావని విద్యార్థులు పాల్గొన్నారు.




Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546